



మాట్లాడుతున్న మేయర్ బివై రామయ్య

మార్ట్ మాయాజాలం..

- మహిళల సొమ్ముతో మహిళా మార్ట్ ఏర్పాటు
- నష్టం పేరుతో మూత.. సరుకులు మాయం
- పొదుపు మహిళల్లో ఆందోళన

పట్టణ మహిళా సమాఖ్యల్లోని పొదుపు మహిళల సొమ్ముతో కర్నూలు నగరంలో ప్రారంభించిన మహిళా మార్ట్‌ను నష్టాల పేరుతో మూత వేశారు. అందులోని సరుకులను కూడా మాయం చేశారు. మార్ట్‌లో చోటుచేసుకున్న అక్రమాలతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని సభ్యులు చెబుతున్నారు. తమ పెట్టుబడి మాయం కావడంతో పొదుపు మహిళల్లో ఆందోళన నెలకొంది...



కర్నూలు నగరంలో మూసివేసిన మహిళా మార్ట్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/కార్పొరేషన్

వైసిపి ప్రభుత్వ హయాంలో మహిళల ఆర్థిక స్వావలంభన కోసం కర్నూలు నగరంలోని సి.క్యాంపులో జగనన్న మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారు. 2023 జూన్ 20న ఈ మార్ట్‌ను ప్రారంభించారు. కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని స్త్రీ శక్తి, మదర్ థెరిసా, పుణ్యవతి, స్వరాజ్యం, లిటిల్ రోజ్ పట్టణ సమాఖ్యలు కలిసి ఐదు సమాఖ్యలు ఒకొక్క సమాఖ్య రూ.10 లక్షల వాటా ధనముతో మొత్తం 50 లక్షల జమతో బ్యాంక్ అకౌంట్ ప్రారంభించారు. అది కాక రూ.16 లక్షలను డిపాజిట్ చేశారు. మొత్తం 44 వేల మంది పొదుపు మహిళల నుంచి ఒక్కొక్కరి నుంచి రూ.150 చొప్పున వసూలు చేశారు. మహిళా మార్ట్‌లో ప్రారంభం నుండే అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపణలు వచ్చాయి. ప్రారంభానికి ముందు మెయింటెన్స్ కోసం రూ.28 లక్షలు ఖర్చు చేశారు. అవసరం లేకున్నా ఆర్భాటం కోసం ఎసిలు ఏర్పాటు చేసి మొత్తం రూ.28 లక్షల ఖర్చు అయినట్లు చూపించారు. పొదుపు సంఘాలు కావడంతో నెలకు రూ.6వేలకు అద్దెకు ఇచ్చారు. పేరుకే పట్టణ సమాఖ్యల ఆధీనంలో ఉన్నా పర్యవేక్షణ మొత్తం అధికారులే చేసినట్లు తెలుస్తోంది. సుమారుగా 10 లక్షలతో సరుకులు తెచ్చి నిర్వహించారు. మార్ట్ నిర్వహణ, అమ్మకాల, కొనుగోలుల, పర్యవేక్షణ, నిర్వహణ కమిటీల ద్వారా జరగాలి. అలా కాకుండా ఏక పక్ష ధోరణితో లావాదేవీలు జరిగినట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. సరుకులు అమ్ముడు పోవడం లేదనే కారణంలో పొదుపు మహిళలు తప్పని సరిగా మార్ట్‌లోనే కొనాలని ఆర్పీలను మానసికంగా వేధించారు. సరుకుల ధర కూడా ఎక్కువ ఉండటం, నాణ్యత లేకపోవటం వల్ల మార్ట్‌కు కొనుగోలుదారులు లేక ఇబ్బందులు ఏర్పడ్డాయి. సిఓలకు మార్ట్ దగ్గర డ్యూటీ వేసి ప్రతి ఆర్పీ ప్రతి సభ్యురాలితో రూ.500 సరుకులు కొనేలా చేయాలని ఒత్తిడి చేసి కొన్నాళ్లు నడిపారు. రూ.13 లక్షల 40 వేలు లాభాలు వచ్చాయని డిపాజిట్ చేయించారు. ఆ డబ్బులు ఉన్నాయి అని చెప్పటమే తప్ప సభ్యులకు పంచింది లేదు. మార్ట్‌లో కీలకపాత్ర వహించే ఓ టిఎల్ఎఫ్ కార్యదర్శి చికిత్స కోసం వెళ్ళటం, మేనేజర్‌ను ఎంపిక చేసుకొని మార్ట్ లావాదేవీలు నిర్వహణకు పూనుకోవటంతో రోజు రోజుకూ బ్యాంక్ బాలెన్స్ తగ్గటంతో చివరకు మార్ట్‌ను మూత వేశారు. అందులోని సరుకులను మాయం చేశారు. మార్ట్ ఖాతాలోని సొమ్ము మొత్తం కొందరు స్వప్రయోజనాలకు వాడుకున్నారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. తమ నుంచి వసూలు చేసిన డబ్బులు మాయం కావడంతో పొదుపు మహిళల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

పెట్టుబడి డబ్బులు వెనక్కి ఇవ్వాలి



మహిళా మార్ట్‌లో మా సభ్యుల ద్వారా పెట్టిన పెట్టుబడి డబ్బులు వెనక్కి ఇవ్వాలి. మహిళా మార్ట్ ప్రారంభించే సమయంలో ఒక్కొక్క సభ్యురాలు రూ.150 చొప్పున పెట్టిన పెట్టుబడిపై లాభాలు వస్తే అందరికీ సమానంగా పంచుతామని చెప్పారు. కానీ వాటిలో పెట్టిన సరుకులు నాణ్యత లేకపోవడం రేట్లు ఎక్కువ ఉండడం, పురుగులు ఉండడం చేత మహిళా మార్ట్‌లోని సరుకులు కొనేందుకు ఇష్టపడకపోవడంతో నష్టాలు వచ్చాయి. నిర్వాహకుల అజమాయిషి లేకపోవడం చేత సిఓల నుండి పిడి వరకు వారి ఇళ్లకు సరుకులు వెళ్లాయని పుకార్లు వినిపించాయి. మహిళా మార్ట్‌పై విచారణ జరిపి పెట్టిన పెట్టుబడి వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం.

- షబానా, ఆర్‌పి.

విచారణ జరిపి న్యాయం చేస్తాం



పలు రకాల కారణాల చేత మహిళా మార్ట్ మూతపడిన విషయం వాస్తవం. నేను కర్నూలులో డ్యూటీలో చేరినప్పటికే మార్ట్ మూతపడి ఉంది. విచారణ కమిటీ వేసి వాస్తవాలను తెలుసుకొని మహిళా మార్ట్‌లో భాగస్వాములందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం.

- విజయభాస్కర్ రెడ్డి, సిఎంఎం.

సరుకులన్నీ మాయమయ్యాయి



మహిళా మార్ట్‌లో నిర్వహణ బాధ్యత సక్రమంగా చూడక పోవడంతో మహిళా మార్ట్ నష్టాల బాట పట్టింది. లాభాలు వస్తే అందరికీ సమానంగా పంచుతామని చెప్పి మా ద్వారా పెట్టుబడి పెట్టించి నడిపారు. నష్టం వచ్చిందనే పేరుతో పెట్టిన పెట్టుబడి ఇవ్వడం లేదు. ఎందుకు ఇవ్వడం లేదో బాధ్యులు సమాధానం చెప్పాలి. సరుకులన్నీ కూడా మాయమయ్యాయి.

- ఊర్మిళ, స్లం లెవెల్ ఫెడరేషన్.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

- స్థాయి సంఘ సమావేశంలో మేయర్ బివై రామయ్య
- 10 అజెండాలకు ఆమోద ముద్ర
- రూ.2.06 కోట్ల వినియోగానికి పచ్చజెండా

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో మౌలిక వసతుల కల్పనే తమ ప్రధాన లక్ష్యమని నగర మేయర్ బివై రామయ్య అన్నారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు. 10 తీర్మానాలను, సాధారణ నిధుల నుండి రూ.2.06 కోట్ల నిధుల వినియోగానికి పచ్చజెండా ఊపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రజా విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ, ప్రాధాన్యత క్రమంలో నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. సభ్యులు లేవనెత్తిన పారిశుధ్య సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో కమిషనర్ యస్.రవీంద్ర బాబు, సభ్యులు యునూస్, క్రాంతి కుమార్, జుబేర్, విక్రమసింహా రెడ్డి, మేనేజర్ యన్.చిన్నరాముడు, ఆరోగ్య అధికారి డాక్టర్ కే.విశ్వేశ్వర్ రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ఓ ఇశ్రాయేలు, టిపిఆర్ఓ వెంకటలక్ష్మి, అకౌంట్స్ ఆఫీసర్ చుండి ప్రసాద్, ఎగ్జామినర్ సుబ్రమణ్యం, ఎంఈలు శేషసాయి, సత్యనారాయణ, సి3 జిఎం. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆమోదించిన తీర్మానాలు : 91 మంది క్లాప్ ఆటోల డ్రైవర్లకు మూడు నెలల బకాయిలు రూ.32.76 లక్షలను చెల్లించేందుకు ఆమోదించారు. రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి బిసి. జనార్థన్ రెడ్డి లేఖ, ప్రజల కోరిక మేరకు దామోదరం సంజీవయ్య (చెక్‌పోస్ట్) నుండి గుంటూరు వెళ్ళు రహదారి విస్తరణ వెడల్పును 120 అడుగుల నుండి 100 అడుగులకు మార్పు చేయుటకు, బాధితులకు టిడిఆర్ బాండ్ల జారీ, ఆర్ అండ్ బి శాఖ నుండి నష్టపరిహారం అందించుటకు అనుమతులు ఇచ్చారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు పెద్దపాడు, ఏ.నాగలాపురం గ్రామాలకు 128 సర్వే నెంబర్‌లో 1.08 సెంట్ల భూమిని స్మశానానికి కేటాయిస్తూ ఆమోదించారు. కాల పరిమితి ముగిసిన కొండారెడ్డి బురుజు సమీపంలోని పూల మార్కెట్‌ను టెండర్ ద్వారా ఇప్పటి వరకు వ్యాపారం నిర్వహించుకుంటున్న అసోసియన్ వారి విజ్ఞప్తి మేరకు మరో మూడేళ్ల లీజుకు ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. బుధవారపేట నందు హిందూ స్మశాన వాటికలో మౌలిక సదుపాయాల కల్పన రూ.50 లక్షలు కేటాయించారు. 41వ వార్డు సిద్దార్థ హోమ్స్ వద్ద రూ.15 లక్షలతో మురుగు కాలువల నిర్మాణానికి టెండర్ పిలిచేందుకు ఆమోదం తెలిపారు. రాజ్‌విహార్ సమీపంలోని ఎల్లమ్మ గుడి నుండి బాపూజీ నగర్ వరకు హంద్రీ ఒడ్డున రహదారి నిర్మాణానికి రూ.50 లక్షలు కేటాయించారు. పార్కుల నిర్వహణకు సంబంధించి కాలపరిమితి ముగిసిన కాంట్రాక్టర్ ద్వారా పని చేస్తున్న 5 మంది సిబ్బందిని మరో నాలుగు నెలల పాటు, మరో 11 మందిని మూడు నెలల పాటు కాలపరిమితి పొడిగింపునకు అవసరమైన రూ.8.70 లక్షలు కేటాయింపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. చెక్‌పోస్ట్ నుండి ఎఫ్‌సిఐ కాలనీ, లేపాక్షి కాలనీల మీదుగా దిన్నెదేవరపాడు రహదారికి అనుసంధానమయ్యే బిటి రహదారి విస్తరణ పనులను చేపట్టేందుకు రూ.50 లక్షలు కేటాయించారు.

ఆర్‌డిఎస్, వేదవతి, గుండ్రేవుల

ప్రాజెక్టుల సమగ్ర నివేదిక ఇవ్వండి

- కలెక్టర్ పి.రంజిత్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాస్తి - కర్నూల్ కలెక్టరేట్

జిల్లాలోని ఆర్‌డిఎస్, వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులకు సంబంధించి సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని నీటి పారుదల ప్రాజెక్టుల పరిస్థితిపై జలవనరుల శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పందికోన రిజర్వాయర్ ద్వారా మరింత ఆయకట్టుకు నీరందించేందుకు వీలుగా రిజర్వాయర్‌కు సంబంధించి మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు రూ.210 కోట్లతో రూపొందించిన ఎస్టిమేట్స్‌ను పంపాలని ఆదేశించారు. హంద్రీనీవా విస్తరణ పనులకు సంబంధించి జిల్లాలో జరుగుతున్న పనులను ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఈ ఏడాది జూన్‌లోపు పూర్తి చేయాలని సూచించారు. హంద్రీనీవా ద్వారా 68 ట్యాంకులను నింపడంలో భాగంగా జిల్లాలో ఉన్న 39 చెరువులకు గాను ఇప్పటివరకు 33 చెరువులకు నీరు నింపినట్లు తెలిపారు. మిగిలిన ట్యాంకులను కూడా త్వరితగతిన నింపాలన్నారు. 33 చెరువులను నిండుగా నింపారా అని కలెక్టర్ అధికారులను ఆరా తీశారు. 23 ట్యాంకులను నిండుగా నింపామని, 10 ట్యాంకులను పాక్షికంగా నీరు నింపినట్లు అధికారులు సమాధానమిచ్చారు. పూర్తి వివరాలను తనకు అందచేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జలవనరుల శాఖ ఎస్ఈ ద్వారకా నాథ్ రెడ్డి, హంద్రీనీవా ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, ఈఈలు, డిఈలు శైలేష్, రామకృష్ణ, విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


అశోక ఉమెన్స్, కెవి సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలల

మురుగు నీటిని ఆపండి

- లేనిపక్షంలో మరోసారి ఆందోళన తప్పదు
- మున్సిపల్ కమిషనర్‌కు సిపిఎం ప్రతినిధి బృందం వినతి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

అశోక ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీ, కెవి. సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్‌ల నుండి వచ్చే మురుగునీరు హంద్రీనదిలోని మంచినీటి రింగు బావిలోకి పడకుండా ఆపాలని, లేనిపక్షంలో మరోసారి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ హెచ్చరించారు. గురువారం మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబును సిపిఎం ప్రతినిధి బృందం జి.రామకృష్ణ, ఎ.కృష్ణ, కె.మధు, షేక్షావలిలు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జి.రామకృష్ణ మాట్లాడుతూ కళాశాలల టాయిలెట్స్, బాత్రూమ్‌ల నుండి వచ్చే మురికి నీటిని పెద్ద పైపుల ద్వారా రింగు బావులలోకి వదిలి నీటిని కలుషితం చేసి దూపాడు గ్రామ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడడం తగదన్నారు. కెవి సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ, అశోక్ ఇంజనీరింగ్ కాలేజీలపై చర్యలు తీసుకొని దూపాడు గ్రామ ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అనేక పర్యాయాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయామన్నారు. అలాగే కెవి సుబ్బారెడ్డి, అశోక్ కుమార్ ఇంజనీరింగ్ కాలేజ్‌ల ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో సామూహిక దీక్షలు చేపట్టి గ్రామ ప్రజలు నిరసనను తెలియజేశారని తెలిపారు. అలాగే కల్లూరు తహశీల్దారు కార్యాలయాన్ని దిగ్బంధం చేసి మరొకసారి నిరసనను తెలిపారని చెప్పారు. అయినా ఇప్పటివరకు అధికారులు ఏమాత్రం సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా కాలేజీ పక్కలోనే పెద్ద గుంత తీసి మురికి నీటిని అందులో వదలాలి తప్ప హంద్రీ నదిలోని రింగ్ బావిలోకి వదిలితే ఏమాత్రం సహించేది లేదని హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి తక్షణమే జోక్యం చేసుకొని సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నారాయణ, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్ రవీంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం ప్రతినిధి బృందం

రోడ్డుకు పన్ను వేసిన ఘనులు కార్పొరేషన్ అధికారులు

- ప్రాంతాన్ని పరిశీలించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్



ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఎం బృందం

కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 45వ వార్డు అశోక్ నగర్ నందు గల నీలం రాజశేఖర్ రెడ్డి నగర్‌లో పేరుతో 2004 నుండి 2025 వరకు రూ.14636 ఇంటి పన్ను బకాయి ఉందని చెల్లించాలంటూ మున్సిపల్ అధికారులు తిరుగుతున్నారు. ఆ ప్రాంతాన్ని సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆ స్థలాన్ని 2004 నుండి నీలం రాజశేఖర్ రెడ్డి నగర్, శ్రీకృష్ణ కాలనీ ప్రజలు రోడ్డుగా ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. గతంలో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో 8 సంవత్సరాల కిందట ఈ రోడ్డును సీసీ రోడ్డుగా మున్సిపల్ అధికారులే నిర్మాణం చేపట్టారన్నారు. ఇదే రోడ్డు లోతిరుగుతున్న మున్సిపల్ అధికారుకు మాత్రం రోడ్డు కనిపించలేదని అన్నారు. 2004 నుండి ఇప్పటివరకు రోడ్డుకు పన్ను వేసిన ఘనత మన మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకే దక్కుతుందని అన్నారు. వార్డుకు మూడు సచివాలయాలు ఏర్పాటు చేసి ఎక్కడా పొరపాట్లు లేకుండా చేస్తున్నామని చెప్పిన అధికారులు నాయకుల మాటలు ఉత్తో అని తేలిపోయిందని అన్నారు. శాటిలైట్ ద్వారా కొలతలు తీశామని ఉన్న ఇంటి కొలతల కన్నా అధికంగా పన్నుల భారం ప్రజలపై వేస్తున్న అధికారులు స్పందించే పరిస్థితిలో లేరని అన్నారు. రోడ్డుకు వేసిన పన్నును పూర్తిగా రద్దు చేయాలని. ఇంటి కొలతల కన్నా ఎక్కువ పన్ను ఉన్న ఇళ్లను పరిశీలించి అదనపు పన్నును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజలను సమీకరించి కార్పొరేషన్ ఎదుట ఆందోళన చేపట్టవలసి వస్తుందని హెచ్చరించారు. సిపిఎం వార్డు కార్యదర్శి టి.బాలలక్ష్మి, వెంకటమ్మ, తిరుపతమ్మ, సంతోషి, బాలస్వామి పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ బకాయిలపై అధికారుల కొరడా

- వాణిజ్య దుకాణాల ఎదుట నిరసనల హోరు
- బకాయిదారులకు పూలతో విజ్ఞాపన

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరపాలక పారిశుధ్య పర్యవేక్షకులు నాగరాజు సిబ్బందితో కలిసి పాతబస్టాండ్‌లో మొండి బకాయిదారులపై కొరడా ఝుళిపించారు. ట్రేడ్ లైసెన్స్‌ను పునరుద్ధరణ చేసుకోని దుకాణదారులకు గురువారం పూలు ఇచ్చి, నగరపాలక చట్టాలకు సహకరించాలని విజ్ఞాపన చేశారు. దీర్ఘకాలంగా మొండిబకాయిలున్న దుకాణాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. సహకరించని దుకాణాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నగరంలో వాణిజ్య దుకాణదారులు నగరపాలక సంస్థ నుంచి ట్రేడ్ లైసెన్స్ తీసుకుని, ప్రభుత్వ ప్రయోజనాలను సగర్వంగా పొందాలని తెలిపారు. పన్నులతోనే ప్రగతి సాధ్యమవుతుందని, వ్యాపారులు ప్రతేడాది తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌ను బాధ్యతయుతంగా పునరుద్ధరణ చేసుకోవాలని సూచించారు. ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నడపడం చట్టవిరుద్ధమని, దీనివల్ల జరిమానాలు, వ్యాపారాన్ని మూసివేయడం జరుగుతుందని తెలిపారు. వ్యాపారులు తక్షణమే మొండి బకాయిలను చెల్లించాలని, ట్రేడ్ లైసెన్స్ పునరుద్ధరణ చేసుకోవాలని కోరారు. పారిశుధ్య తనిఖీదారులు లోకేష్, జిలాని పాల్గొన్నారు.

కిడ్నీ ఆరోగ్యంపై అవగాహన పెంచాలి

- ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కిడ్నీల ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచాలని కర్నూలు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో ప్రపంచ కిడ్నీ డే నిర్వహించారు. జిజిహెచ్, కెఎంసి, నెఫ్రాలజీ విభాగం ఆధ్వర్యంలో సిఎంఇ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడారు. కిడ్నీ సంబంధిత వ్యాధులను గుర్తించి ప్రజలకు అవగాహన కల్పించడం దీని ముఖ్య ఉద్దేశ్యం తెలిపారు. అధిక సోడియం కలిగిన ఆహారాలు, కార్బొనైటెడ్ పానీయాలు, ప్రాసెస్ చేసిన మాంసం మూత్రపిండాల ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని చెప్పారు. మంచి ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించి మంచి ఆహారం, వ్యాయామం చేయాలని కోరారు. కర్నూలు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ... దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి (సికెడి) గురించి అవగాహన పెంచడానికి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఈ సమస్యను ఎదుర్కోవడంలో ప్రజలందరి భాగస్వామ్యాన్ని పెంచడానికి ఇదో మంచి ముందడుగని తెలిపారు. సీనియర్ నెఫ్రాలజిస్ట్ అండ్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజిషియన్ యశోద హాస్పిటల్, హైదరాబాద్ డాక్టర్ ఎ.శశికిరణ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ సీతారామయ్య, డాక్టర్ జిక్కి, డాక్టర్ అనంత్, డాక్టర్ వెంకటపక్కి రెడ్డి, డాక్టర్ శ్రీధర్ శర్మ పాల్గొన్నారు.



డాక్టర్ శశికిరణ్ సన్మానిస్తున్న డాక్టర్ చిట్టి నరసమ్మ, డాక్టర్ కె.వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న జెసి డాక్టర్ నవ్య

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

- జెసి డాక్టర్ నవ్య

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని జెసి డాక్టర్ బి నవ్య పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్లో వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళికపై సమావేశం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ వ్యవసాయ శాఖలకు చెందిన సిబ్బంది గ్రామస్థాయిలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి వారికి కావలసిన విషయపరిజ్ఞానాన్ని తెలియజేయాలన్నారు. తక్కువ ఖర్చుతో జీవామృతాలు, మంచి విత్తనాలతో పంటలు పండించే విధానాన్ని రైతులకు అందజేయవలసిందిగా కోరారు. రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రకృతి వ్యవసాయం చేసే చర్యలు ముఖ్యంగా వివరించి ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారిని వరలక్ష్మి, డిఆర్‌డిఎ పిడి రమణారెడ్డి, ఏపీఎంఐపి పిడి ఉమామహేశ్వరమ్మ, హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు, డిడి ఫిషరీస్ శ్యామల, ఏడి మార్కెటింగ్ నారాయణమూర్తి, అగ్రికల్చర్ ఆఫీసర్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

తెలుగు అవధానం.. జీవన విధానం కావాలి

- అష్టావధాని డాక్టర్ బోరెల్లి హర్ష

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

తెలుగు అవధానం ఆంధ్రుల జీవన విధానం కావాలని అష్టావధాని డాక్టర్ బోరెల్లి హర్ష తెలిపారు. గురువారం కర్నూలు మండలం మిలటరీ కాలనీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరమ్మ అధ్యక్షతన అష్టావధానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ డిఇఓ హనుమంతరావు ప్రారంభించారు. అష్టావధానిగా డాక్టర్ బోరెల్లి హర్ష పృక్షకులుగా అవధానం సుధాకర్ శర్మ (నిషిద్ధాక్షరి), మారేడు రాముడు (సమస్య), తొగట సురేష్ (దత్తపది), చంద్రమౌళిని (వర్ణన), వరలక్ష్మి (న్యస్తాక్షరి), ఎర్రమ్మ పాండురంగయ్య (పురాణ పఠనం), దేవవరం (ఆశువు), శ్రీనివాసులు (అప్రస్తుత ప్రసంగం), పి.రాఘవయ్య (యాంత్రిక గణనం) వ్యవహరించారు. పృక్షకులు సంధించిన వివిధ ప్రశ్నలకు అవధాని హర్ష అవలీలగా చమత్కారాలతో, పద్యాలను, ఆశువుగా చెబుతూ సమస్య పూరణం చేశారు. తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, డిప్యూటీ డిఇఓ హనుమంతరావును, అవధానిని, పృక్షకులను, అవధాని తండ్రి బీడీ సుధీర్ రాజును, విద్యా కమిటీ ఛైర్మన్ రామాంజులును శాలువాలు, మోమెంటులతో సన్మానించారు.



హర్షను సన్మానిస్తున్న సిబ్బంది

జెమ్‌కేర్, కామినేని హాస్పిటల్‌లో వరల్డ్ కిడ్నీ డే వేడుకలు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

నగరంలోని కొత్త బస్టాండ్‌లో గల జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌లో గురువారం వరల్డ్ కిడ్నీ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నెఫ్రాలజిస్ట్ రవికుమార్ మహంకాళి హాజరయ్యారు. ఈ సందర్భంగా రూ.3,180 విలువగల ప్యాకేజీని కేవలం రూ.499లకే అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్యాకేజీని రవికుమార్ మహంకాళి, సతీష్ కుమార్ యూరాలజిస్ట్ ప్రారంభించారు. తమ దగ్గర డయాలసిస్ ట్రీట్‌మెంట్ పొందుతున్న పేషంట్లకు సన్మానం చేశారు. డాక్టర్ చంద్రశేఖర్ ఎమ్‌డి, సిఇఓ, డైరెక్టర్ డాక్టర్ రవిబాబు, డాక్టర్ రామ్మోహన్, డాక్టర్ నిశాంత్, డాక్టర్ గణేష్, సిఓఓ డాక్టర్ కృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యులు

వలస కూలీ మృతి

ప్రజాశక్తి - తుగ్గలి

మండలంలోని తుగ్గలి గ్రామానికి చెందిన బురుజుల రంగప్ప (53) వలస వెళ్లి బాపట్ల జిల్లా పూసపాడు గ్రామంలో మృతి చెందారు. బంధువుల వివరాల మేరకు... నెల క్రితం తుగ్గలి గ్రామం నుంచి వంద కుటుంబాలు బాపట్ల జిల్లాకు వలస వెళ్లాయి. బురుజుల రంగప్ప బాపట్ల జిల్లా పూసపాడు గ్రామం వలస వెళ్లి పొగాకు కోస్తూ జీవనం సాగించేవారు. ఎండవేడిమికి తట్టుకోలేక గురువారం మృతి చెందారు. ఉన్న ఊరిలో పనులు లేక పొట్టకూటి కోసం వలస వెళ్లి అస్వస్థతకు గురై మృతి చెందడంతో మృతదేహాన్ని గురువారం గ్రామానికి తెచ్చారు.

వందరోజుల పని దినాలు కల్పించాలి

- కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ఉపాధి కూలీ కుటుంబానికి వంద రోజులు ఉపాధి పని దినాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకునేందుకు అందిస్తున్న అదనపు ఆర్థిక సాయంపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. 15 నుండి 23 వ తేదీ వరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, ఏఈలు ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు ఈ విషయాన్ని వివరించాలన్నారు. ప్రతి నెల మూడో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం ప్రతి గ్రామం, వార్డులో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఉపాధి హామీ పనుల కల్పనలో వెనకబడిన ఉన్న మండలాలు పురోగతి సాధించాలని ఆదేశించారు. రోజువారిగా లక్ష మందికి పైగా కూలీలు పనులకు హాజరయ్యేలా చూడాలన్నారు.

కవయిత్రి మొల్లమాంబకు కలెక్టర్ నివాళి

సంస్కృత రామాయణాన్ని తెలుగు భాషలోనికి అనువదించిన తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ అని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో మొల్లమాంబ జయంతిని పురస్కరించుకొని చిత్ర పటానికి పూలమాల వేసి జిల్లా కలెక్టర్ నివాళులర్పించారు. తెలుగులో రామాయణం లాంటి గొప్ప కావ్యం అందించిన వారి దీక్ష, పట్టుదల అందరికీ స్ఫూర్తిదాయకం, మార్గదర్శకం అని కలెక్టర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సెట్కూరు సీఈవో డాక్టర్ కె వేణుగోపాల్, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కలెక్టర్

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

- ప్రిన్సిపల్ సవిత

ప్రజాశక్తి - మద్దికెర

మండలంలోని ఎపి మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సవిత తెలిపారు. గురువారం ఆమె మాట్లాడారు. ఈ నెల 17 నుంచి మే 22 వరకు ఆన్‌లైన్‌లో జనరల్ నెంబర్ వచ్చాక ఆ నెంబర్ లింక్‌తో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం పదో తరగతి పరీక్షల ఫలితాలు వెల్లడి అయ్యాక మార్కుల జాబితాను బట్టి ఎంపిసి, బైపిసి, సిఇసి, ఎంఇసి సీట్లు కేటాయిస్తామన్నారు. బీసీ, ఓసీ, ఈడబ్ల్యుఎస్ దరఖాస్తు దారులు చలానా రూ.200, ఎస్సీ, ఎస్టీలు రూ.150 చెల్లించాలని కోరారు.

నేడు అలీషా స్వాముల ఆరాధన

ప్రజాశక్తి - సిబెళగల్

బెళగల్‌లో అలీషా స్వాముల వారి 16వ ఆరాధన ఉరుసు శుక్రవారం జరుగుతుందని రెండో పీఠాధిపతులు గురు నసూరుల్లా అలీషా స్వాములు పేర్కొన్నారు. గురువారం గంధం ఘనంగా జరిగిందని, నేడు ఉరుసు సందర్భంగా భక్తులు అధిక మొత్తంలో పాల్గొనాలని కోరారు. అలాగే ఉరుసు సందర్భంగా భక్తులకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

చెత్తతో సంపద సృష్టించాలి

- డిఎల్‌పిఒ నుర్జహాన్


మాట్లాడుతున్న డిఎల్‌పిఒ నూర్జహాన్

ప్రజాశక్తి - హోళగుంద

గ్రామాల్లో చెత్త సేకరణ ద్వారా తడి, పొడిచెత్తను వేరు చేసి ఆ వ్యర్థాల నుంచి ఎరువులను తయారు చేసి సంపద సృష్టించుకోవాలని ఆదోని డిఎల్‌పిఒ నుర్జహాన్, ఎంపిడిఒ విజయ లలిత తెలిపారు. గురువారం మేజర్ పంచాయతీ సర్పంచి చలువాది రంగమ్మ అధ్యక్షతన స్థానిక వేస్ట్ డంపింగ్ యార్డ్ వద్ద హోళగుంద, హాలహర్వి మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామంలోని చెత్తను సేకరించడం ద్వారా గ్రామాల్లో పరిశుభ్రత పాటించడంతోపాటు వ్యర్థాల నుంచి ఎరువును తయారు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇఒఆర్‌డిలు చక్రవర్తి, రామాంజినేయులు, పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్ గౌడ్, రంగస్వామి, కురువ నాగరాజు, షఫీ, ఉమా మహేశ్వరి, నాగరాజు, నిరంజన్, మంజునాథ్ పాల్గొన్నారు.

అంగన్వాడీ, సచివాలయాల్లో తనిఖీలు


తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని కనకవీడు పేట గ్రామంలో గురువారం ఎంపిడిఒ పుల్లయ్య పర్యటించారు. ముందుగా సచివాలయాన్ని సందర్శించి ఉద్యోగుల అటెండెన్స్ రిజిస్టర్, ఇటీవల చేపడుతున్న సర్వేల ప్రోగ్రెస్‌ను పరిశీలించారు. ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలతో చేపడుతున్న సిసి రోడ్డు, డ్రెయినేజీ పనులను పర్యవేక్షించారు. అనంతరం ఆయన అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లలకు అందిస్తున్న సదుపాయాలు, ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ మంచిగా అందించేలా చూడాలని టీచర్స్‌ను కోరారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

- 24, 25న బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సిఐటియు మద్దతు


బ్యాంకు ఉద్యోగులతో కలిసి కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కేంద్ర ప్రభుత్వ బ్యాంకుల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని సిఐటియు తాలూకా కార్యదర్శి బి.రాముడు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ బ్యాంకుల్లో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఈనెల 24, 25న బ్యాంకు ఉద్యోగులు చేపట్టే సమ్మెకు మద్దతుగా గురువారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి బ్యాంకుల్లో పోస్టులను భర్తీ చేయకుండా ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులను తాత్కాలికంగా నియమించడం సరైంది కాదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ పరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా యునైటెడ్ ఫారం బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో చేపట్టే సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు తెలుపుతుందని అన్నారు. బ్యాంకు ఉద్యోగులు చేపట్టే సమ్మెకు ఖాతాదారులు, ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారులు సహకరించాలని కోరారు. బ్యాంకు నాయకులు వీరేష్, నారాయణ, సిఐటియు నాయకులు పి.రాజు, కె.ఖాజా పాల్గొన్నారు.

వాల్మీకుల అభివృద్ధికి సహకరించాలి

- వాల్మీకి నాయకులు సాయిప్రసాద్

ప్రజాశక్తి - ఆదోని

వాల్మీకుల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, నాయకులు సహకారం అందించాలని వాల్మీకి సంఘం నాయకులు వాల్మీకి సాయి ప్రసాద్ కోరారు. గురువారం ఆదోనిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినందుకు ఆదోని ఎమ్మెల్యే పార్థసారథికి అండగా ఉంటామన్నారు. అన్ని రాష్ట్రాల్లో వాల్మీకులు ఎస్సీ, ఎస్టీగా కొనసాగుతున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోను ప్రాంతీయ వ్యత్యాసాలు ఉన్నాయని, గోదావరి, ఉత్తరాంధ్రలో వాల్మీకులు ఎస్టీలుగా ఉన్నారని చెప్పారు. రాయలసీమలో మాత్రమే వాల్మీకులు బీసీలుగా గుర్తించడం అనేది రాజ్యాంగ విరుద్ధమన్నారు. వాల్మీకి సంఘం నాయకులు సింహం నాగేంద్ర, బి.గోపాల్, బంకా ముని, చంద్ర, తాయన్న, బిల్లాల రామాంజనేయులు, ఉషా రాజు, సంజీవ్, నరసింహులు, దేవంద్ర, లక్ష్మీనారాయణ, రామయ్య, చంటి ఉన్నారు.

రాని బిల్లులు..!

- రూ.1.85 కోట్లు పెండింగ్ - అప్పులు తెచ్చి పనులు చేసిన వైనం
- పెరుగుతున్న వడ్డీలు
- తలలు పట్టుకుంటున్న కాంట్రాక్టుదారులు

ప్రజాశక్తి - చిప్పగిరి

చేసిన పనులకు బిల్లులు రాక కాంట్రాక్టుదారులు తల పట్టుకుంటున్నారు. బిల్లులు వస్తాయని అప్పులు తెచ్చి మరీ కాంట్రాక్టుదారులు పనులు చేశారు. బిల్లు రాకపోవడంతో అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని వాపోతున్నారు.

'పల్లె పండగ' పేరుతో ప్రభుత్వం సిసి రోడ్డు నిర్మాణాలను ఎంతో హడావుడిగా మొదలుపెట్టింది. గతేడాది అక్టోబర్‌లో గ్రామాభివృద్దే లక్ష్యంగా పనులు ప్రారంభించింది. ఈ పనులకు బిల్లులు మాత్రం ఇప్పటికీ విడుదల చేయలేదు. పల్లెల్లో సిసి రోడ్డు నిర్మాణ పనులు సంక్రాంతి పండగ నాటికి పూర్తి చేస్తామని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులు సమీక్షల మీద సమీక్షలు నిర్వహించారు. సంక్రాంతి పండగ నాటికి పూర్తి చేయాలని నిర్ణీత గడువును కూడా విధించింది. ఈ నేపథ్యంలో పల్లెల్లో కొంతమంది కూటమి పార్టీకి చెందిన నాయకులు కూడా పనులు చేశారు. బిల్లులు విడుదల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదని కూటమి ప్రభుత్వం విమర్శిస్తూ ఉండేది. కానీ అదే దారిలో తాను


పల్లె పండగలో భాగంగా రోడ్డు నిర్మాణాలు

ఉన్నట్లు గుర్తించడం లేదు. పల్లె పండగ పేరుతో గ్రామాల్లో రోడ్లు, మినీ గోకులం షెడ్ల నిర్మాణాలు తదితర అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపట్టింది. చేసిన పనులకు చేసినట్లుగా 'ఎం బుక్'లో రికార్డు చేసి బిల్లులను అప్‌లోడ్ చేశాక రెండు, మూడు రోజుల్లోనే బిల్లులు వస్తాయని అధికారులు చెప్పారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా మండలంలో మొత్తం రెండు కిలోమీటర్ల సిసి రోడ్డు నిర్మాణాలు చేపట్టినట్లు అధికారులు తెలుపుతున్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు దాదాపు రూ.1.85 కోట్లు ఉన్నాయని పంచాయతీరాజ్ అధికారులు పేర్కొంటున్నారు. సిసి రోడ్డు నిర్మాణాలు చేపట్టిన వారు 'బిల్లులు ఈవారం వస్తాయి.. ఆ వారం వస్తాయ'ని ఎదురుచూస్తున్నారు. ప్రతివారమూ చేసిన పనులకు బిల్లులు పడతాయని మొదట్లో అధికారులు చెప్పారు. ఒకటి, రెండు వారాలు తప్ప ఆ తర్వాత బిల్లులు ఇప్పటివరకు విడుదల చేయలేదు. పెండింగ్‌లో ఉన్న సిసి రోడ్డు నిర్మాణాల బిల్లులు ప్రభుత్వం త్వరగా విడుదల చేయాలని, లేకపోతే తమకు వడ్డీల మీద వడ్డీలు ఎక్కువై పనులు చేయడానికి కూడా ముందుకు రాలేకపోతున్నామని కాంట్రాక్టు దారులు ఆవేదన చెందుతున్నారు.

రెండు కిలోమీటర్లు సిసి రోడ్డు నిర్మాణాలు జరిగాయి

- సోమప్ప, పిఆర్ ఏఈ



పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని రెండు గ్రామాలు గుమ్మనూరు, నంచర్ల తప్ప అన్ని గ్రామాల్లోనూ ఉపాధి హామీ చట్టం నిధులతో సిసి రోడ్డు నిర్మాణాలు జరిగాయి. సిసి రోడ్డు నిర్మాణాలు దాదాపు రెండు కిలోమీటర్లు జరిగాయి. వాటి బిల్లులు రూ.1.85 కోట్లు ఉన్నాయి. నివేదికలు ఉన్నతాధికారులకు పంపాం. ఎప్పుడు వస్తాయో మాకు కచ్చితమైన సమాచారం లేదు.

రజకులకు రక్షణ చట్టం తేవాలి

- రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముక్కన్న, గురుశేఖర్

ప్రజాశక్తి - ఆలూరు

పాలకుల నిర్లక్ష్యం వల్ల రజకులు నష్టపోతున్నారని, రజకులకు రక్షణ చట్టం తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముక్కన్న, గురు శేఖర్ తెలిపారు. గురువారం ఆలూరులోని మంగళ ఆంజనేయస్వామి గుడి ఆవరణలో సంఘం సభ్యులు రమేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నేటికీ కూడా రజకులపై దాడులు, సాంఘిక బహిష్కరణలు, అత్యాచారాలు, కులం పేరుతో దూషణలు, వేధింపులు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రజక వృత్తిదారులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈనెల 22న కోడుమూరులో జరిగే జిల్లా 6వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. జిల్లా కమిటీ సభ్యులు చిగిలి ఈరన్న, హోళగుంద నాగరాజు, హాలహర్వి ఈశ్వర్, ఆలూరు సిద్దప్ప, అంజి, సుధాకర్, సోమశేఖర్, లోకేష్ పాల్గొన్నారు.


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

సెక్యూరిటీ గార్డులు, స్వీపర్ల పెండింగ్ జీతాలివ్వాలి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో పనిచేసే స్వీపర్స్, సెక్యూరిటీ గార్డుల పెండింగ్ జీతాలు ఇవ్వాలని సిఐటియు నాయకులు విజయ రామాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం సిఐటియు నగర ఉపాధ్యక్షులు మైమూద్ అధ్యక్షతన విజయ రామాంజనేయులు, కుమార్‌లు హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వానికి, ప్రభుత్వ అధికారులకు చిత్తశుద్ధి ఉంటే స్వీపర్స్, సెక్యూరిటీ గార్డులకు పెండింగ్ జీతాలు ఇప్పించి అక్రమంగా తొలగించిన కార్మికులను తక్షణమే డ్యూటీలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని హెచ్చరించారు.

మార్క్‌ఫెడ్ ద్వారా శనగ కొనుగోలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

మార్క్‌ఫెడ్ ద్వారా శనగ కొనుగోలు చేపడుతున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శనగలు క్వింటా రూ.5650లాగా మద్దతు ధర కల్పించామన్నారు. శనగ పంటను అమ్మే రైతులు తమ పేర్లను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని కోరారు.

ముళ్లకంప తొలగింపు

- ఎమ్మెల్యేకు మైనార్టీ నాయకుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి - నందవరం

నాగలాదిన్నె శ్మశాన వాటికలో ఉన్న ముళ్లకంపను ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు తొలగించారు. ఎంపిడిఒ పుల్లయ్య ఆధ్వర్యంలో గురువారం శ్మశాన వాటికలో భారీగా మెలచిన ముళ్లకంపను జెసిబి సహాయంతో తొలగించారు. నాగలదిన్నె మైనార్టీ నాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు ఎన్.ఎ.జబ్బార్, సుల్తాన్, మునాఫ్ మాట్లాడారు. గ్రామంలో మైనార్టీ శ్మశాన వాటిక చెట్లు, గుంతలమయంగా మారి దుర్భరంగా ఉండేదని, మైనార్టీలు చనిపోతే వారి అంత్యక్రియలు చేయడానికి చాలా ఇబ్బందికరంగా తయారైందని తెలిపారు. మైనార్టీ ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి గతవారం ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఆయన స్పందించి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అడిగిన వెంటనే మైనార్టీ ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే పరిష్కరించినట్లు చెప్పారు. సెక్రటరీ నౌసన్న, వైసిపి నాయకులు తిమ్మప్ప, మహబూబ్, టిడిపి యువ నాయకులు మునాఫ్, నబిరసూల్, వలీ, సలీం పాల్గొన్నారు.


కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

కిడ్నీ సమస్య బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలి

- రోటరీ క్లబ్ సెక్రటరీ డాక్టర్ సైఫుల్లా

ప్రజాశక్తి - ఆదోని

కిడ్నీ సమస్య బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని రోటరీ క్లబ్ సెక్రటరీ డాక్టర్ సైఫుల్లా, డాక్టర్ రాజా సూచించారు. గురువారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అపోలో డయాలసిస్ క్లినిక్ వారి సహకారంతో ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ సెక్రటరీ డాక్టర్ సైఫుల్లా మాట్లాడారు. మానవ శరీరంలో ప్రతి అవయమూ చాలా ముఖ్యమైందని, ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారంతో పాటు వ్యాయామాలు కూడా అవసరమని తెలిపారు. రోడ్లపై తిరుగుబండారాలు, గోబి, పానీ పూరి, బర్గర్లు, కూల్ డ్రింకులు, ఆల్కహాల్ సేవించడంతో అనారోగ్యాల బారిన పడి కిడ్నీ దెబ్బతినే అవకాశం ఉందని చెప్పారు. ముఖ్యంగా ఆర్ఎంపిలు ఇచ్చే స్టెరాయిడ్స్, అధిక మోతాదు ట్యాబ్లెట్ల వల్ల అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. అనారోగ్యాలకు గురైతే ప్రజలు ఎక్కడ పడితే అక్కడ వైద్య పరీక్షలు చేసుకుని తాత్కాలిక ఉపశమనం పొంది జరగబోయే అనారోగ్య ప్రమాదాలను గమనించుకోక పోతే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని గుర్తు చేశారు. షుగర్, బీపీ ఉన్నవారు కూడా కిడ్నీకి సంబంధించిన వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతులు కూడా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేసుకుని ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవాలని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 100 మంది వైద్య పరీక్షలు చేసుకున్నారు. రోటరీ క్లబ్ సభ్యులు సునీల్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, బసవరాజు, ప్రశాంత్ గాంధీ, రాజేష్ జైన్, సనతయ్య, పద్మనాభయ్య శెట్టి, సుబ్బయ్య, హుస్సేన్ బాష, విట్టా రాజేష్, రాజేష్ పాల్గొన్నారు.


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు


బాధితులను పరామర్శిస్తున్న దేవేంద్రప్ప, కృష్ణమ్మ

బాధితులకు అండగా ఉంటాం

- కురువ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని కురువ కార్పొరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. రెండు రోజుల క్రితం కర్ణాటక బస్సు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుప్పగల్ గ్రామానికి చెందిన కురువ ఈరన్న, కురువ ఆదిలక్ష్మి కూతురిని, కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా వాఉ మాట్లాడారు. రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను పోగొట్టుకున్న ఆ పసిపాపను చూస్తుంటే కడుపు తరుక్కుపోతుందని వాపోయారు. టిడిపికి చెందిన కురువ ఈరన్న, ఆదిలక్ష్మి కుటుంబానికి అండగా ఉంటామని, టిడిపి తరఫున రావాల్సిన ఆర్థిక సహాయం త్వరగా వచ్చేటట్లు చూస్తామని తెలిపారు. పాప పెద్దయిన తర్వాత ఎన్‌టిఆర్ ట్రస్ట్ స్కూల్‌లో చదివించే విధంగా నారా లోకేష్‌తో మాట్లాడతామని చెప్పారు. మాజీ జడ్‌పిటిసి రామ్‌భీంనాయుడు, నాయకులు మురళీ, బైచిగేరి ఓంకార్, బైచిగేరి ఫీల్డ్ అసిస్టెంట్ రామాంజిని, గణేకల్ ఎల్లప్ప, బంగారు బాబు, పురుషోత్తం యాదవ్, చిరంజీవి, ఖాసీం, ప్రభు, అశోక్, భరత్ కుమార్, రాఘవరెడ్డి, విజయ్, చిట్టి, వీరేష్, ముని, వెంకటేష్, హరి, కుప్పగల్లు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు హనుమంతు, అంజి, భోజప్ప, రవి ఉన్నారు.

ఉపాధ్యాయునికి షోకాజ్ నోటీసు

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుంద మండలంలోని వన్నూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న బి.శివశంకర్ రెడ్డికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. జులై 5, 2024 నుంచి నేటి వరకు ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడంతో షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు ఎంఇఒలు జగన్నాథం, సత్యనారాయణ గురువారం తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయులు తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారులకు రిపోర్టింగ్ చేయాలని, లేకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సిఐ రవి శంకర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఆలూరు



సిఐల బదిలీలో భాగంగా అన్నమయ్య జిల్లా ఉమెన్ పిఎస్ నుంచి ఆలూరు సిఐగా రవిశంకర్ రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ... పట్టణ, గ్రామాల్లో పేకాట, అక్రమ మద్యం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రజలు, పోలీసు సిబ్బంది సహకారంతో శాంతిభద్రతలను కాపాడతామని చెప్పారు.

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఎమ్మెల్యే ఆరా

- సబ్ కలెక్టర్, సంబంధిత వైద్యులతో మాట్లాడిన ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



మండలంలోని బనవాసి గురుకుల బాలికల కళాశాల విద్యార్థులు అస్వస్థకు గురై ఆస్పత్రికి చేరిన విషయం తెలిసిందే... ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి గురువారం సంబంధిత వైద్యులతో, సబ్ కలెక్టర్‌తో ఫోన్ ద్వారా సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం విద్యార్థులు బాగున్నారని, ఎలాంటి ఇబ్బందులూ లేవని, ఎండ వేడిమి కారణమని అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడారు. వేసవి కారణంగా ఇంటర్మీడియట్ విద్యార్థులు జ్వరంతో ఇబ్బంది పడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. వారికి ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. విద్యార్థులు వేసవిని దృష్టిలో ఉంచుకొని ఎప్పటికప్పుడు తాగునీరు, ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం గురుకుల కళాశాల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ లేవని తెలిపారు. వైద్యులు కూడా ఎప్పటికప్పుడు అన్ని చర్యలూ చేపడుతున్నారని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు అధైర్య పడాల్సిన అవసరం లేదని సూచించారు.

ఎల్‌ఎల్‌సి ఈఈగా పాండురంగయ్య

ప్రజాశక్తి - ఆదోని

తుంగభద్ర దిగువ కాలువ కార్యాలయం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పాండురంగయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. పోలవరం ప్రాజెక్టులో ఈఈగా విధులు నిర్వహిస్తున్న పాండురంగయ్యను ప్రభుత్వం ఆదోనికి బదిలీపై పంపింది. ఆయన మాట్లాడుతూ... ఆయకట్టు రైతులకు అందుబాటులో ఉంటూ ఎల్‌ఎల్‌సి ద్వారా నీరు పంటలకు సక్రమంగా అందేలా చూస్తామన్నారు. ఎల్‌ఎల్‌సి పరిధిలో జలచౌర్యం జరగకుండా చూడాలని తెలిపారు. అంతకుముందు ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.


ఈఈని కలిసిన టిప్పు సుల్తాన్

ఎల్‌ఎల్‌సి రైతులకు అండగా ఉందాం

తుంగభద్ర దిగువ కాలువ కింద ఉన్న ఆయకట్టు రైతులకు అండగా ఉంటూ పూర్తిస్థాయిలో సాగునీరందించి పంటలను కాపాడదామని తుంగభద్ర ప్రాజెక్టు ఛైర్మన్ టిప్పు సుల్తాన్, తెలుగు రైతు అధికార ప్రతినిధి, ఎల్‌ఎల్‌సి నీటి వాటా పరిరక్షణ కమిటీ వ్యవస్థాపకులు సాయిబాబు కోరారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఈఈ పాండురంగయ్య ఇక్కడికి బదిలీపై రావడం రైతులకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదోని తుంగభద్ర దిగువ కాలువ ఈఈగా బాధ్యతలు చేపట్టిన పాండురంగయ్యను టిప్పు సుల్తాన్, సాయిబాబా మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. గతంలో పాండురంగయ్య ఇక్కడ పనిచేసిన సమయంలో సాగునీటికి ఢోకా లేకుండా అందించారని, ఆయన సేవలను ఇక్కడ మరోసారి వినియోగించుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. అలాగే పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణానికి సలహాలు, సూచనలు పొంది ప్రభుత్వానికి విన్నవిస్తామని చెప్పారు. ఈఈ పాండురంగయ్య మాట్లాడుతూ... తుంగభద్ర ప్రాజెక్టు ఛైర్మన్ టిప్పు సుల్తాన్ సహకారంతో రైతులకు న్యాయం చేస్తామని, పూర్తిస్థాయిలో తుంగభద్ర కోటా నీరు సాధిస్తామని తెలిపారు. రైతులకు అండగా ఉంటామని, పంటలు ఎండిపోకుండా కృషి చేస్తామని చెప్పారు.

ప్రభుత్వ బీసీ ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టల్ ఏర్పాటు చేయాలి

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో బీసీ ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని కెవిపిఎస్ కార్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ అధ్యక్షులు రాము అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగప్ప, ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి విజయ్ మాట్లాడారు. జిల్లాలోని పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఎమ్మిగనూరులోని సోమప్ప పాఠశాలలో చదువుకోవాలని ఇక్కడ అడ్మిషన్ పొందుతున్నారని తెలిపారు. అక్కడ సౌకర్యాలు లేక చాలామంది వెనుదిరిగి పోవాల్సిన పరిస్థితి ఉందని చెప్పారు. బీసీ ప్రీమెట్రీ హాస్టల్‌కు దాదాపు 600 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే వారికి పరీక్షలు పెట్టి ఉత్తీర్ణత సాధించిన వారికి మాత్రమే కేటాయించినట్లు తెలిపారు. చాలామంది పేద విద్యార్థులు సొంత గ్రామాలకు వెళ్లి చదువులు మధ్యలోనే మానేసి తల్లిదండ్రులతో పాటు వలస వెళ్లిన సందర్భాలూ ఉన్నాయని చెప్పారు. గతంలో జిల్లా పర్యటనకు వచ్చిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత,


సమావేశంలో మాట్లాడుతున్న రంగప్ప

ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర్ రెడ్డితో కలిసి పట్టణంలోని ప్రీ మెట్రిక్ హాస్టల్ దగ్గరకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి వారి బాగోలు తెలుసుకున్నారని తెలిపారు. ఈ ప్రయివేట్ భవనంలో తక్కువ సదుపాయాలు ఉన్నాయని, ఎక్కువ మంది విద్యార్థులు ఉండడం వల్ల కాలకృత్యాలకు ఇబ్బందిగా మారిందని మంత్రికి వివరించారని చెప్పారు. స్పందించిన మంత్రి సవిత... రాబోయే విద్యా సంవత్సరంలో అన్ని ఏర్పాటు చేస్తామని హామీఇచ్చారని గుర్తు చేశారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే స్పందించి రాబోయే విద్యా సంవత్సరం ఎమ్మిగనూరులో చదవడానికి వచ్చే విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన బీసీ ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లావ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు నితీష్ పాల్గొన్నారు.

గోనెగండ్ల సిఐ గంగాధర్ బదిలీ

- నూతన సిఐగా బాధ్యతలు చేపట్టిన విజయభాస్కర్


వీడ్కోలు పలుకుతున్న స్టేషన్ సిబ్బంది

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల సిఐ ఎ.గంగాధర్ కర్నూలు విఆర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నంద్యాల విఆర్ నుంచి విజయ భాస్కర్ సిఐగా గురువారం బాధ్యతలు చేపట్టారు. పోలీసు స్టేషన్ సిబ్బంది, మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, ప్రజలు గురువారం రాత్రి బదిలీపై వెళ్తున్న సిఐ గంగాధర్‌ను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అలాగే నూతన సిఐగా బాధ్యతలు చేపట్టిన విజయభాస్కర్‌ను పూలమాలలతో స్వాగతించారు. ఎమ్మిగనూరు డీఎస్పీ సురేంద్రబాబు హాజరయ్యారు. బదిలీపై వెళ్తున్న సిఐ గంగాధర్ మాట్లాడుతూ... ఏడు నెలల కాలంలోనే మండలంలోని ప్రజల అభిమానం చూరగొని ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. విధుల్లో చేరిన నూతన సిఐ విజయ భాస్కర్ మాట్లాడుతూ... వివిధ సమస్యలతో స్టేషన్‌కు వచ్చే ప్రజల పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరించి చట్టపరంగా న్యాయం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.


సిఐ విజయభాస్కర్

పిఠాపురం బయల్దేరిన జనసేన నాయకులు

ప్రజాశక్తి - ఆస్పరి

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పిఠాపురంలో నిర్వహించే జయ కేతన కార్యక్రమానికి ఆలూరు ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప ఆధ్వర్యంలో గురువారం ఆస్పరి జనసేన నాయకులు రెండు బస్సుల్లో బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు అరవింద్ కుమార్ మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభివృద్ధి కోసం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జనసేన పార్టీని స్థాపించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల అధ్యక్షులు అశోక్, చిరంజీవి, ఛత్రపతి, వీరేష్, నాయకులు చంద్రమోహన్, శ్రీనివాసులు, విశ్వనాథ్, ప్రసాద్ పాల్గొన్నారు. **కౌతాళం** నుంచి జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు నాయకులు పిఠాపురం బయల్దేరారు. జనసేన మండల నాయకులు రామాంజనేయులు, ఆకాష్, మహ్మద్, మహాదేవ, గణేష్, అబ్దుల్ ఖాదర్, ఏసోబు, రాంప్రసాద్, చంద్ర, రాఘవేంద్ర ఉన్నారు. **చిప్పగిరి** నుంచి ఆలూరు ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప ఆధ్వర్యంలో జనసేన నాయకులు రెండు బస్సుల్లో బయల్దేరారు. జనసేన మండల అధ్యక్షులు కె.చిరంజీవి మాట్లాడారు. మండలాల అధ్యక్షులు అరవింద్, అశోక్, చత్రపతి, వీరేష్, నాయకులు దాసరి నవీన్, రామదుర్గం ధర్మ, తిమ్మాపురం మోహన్, లక్ష్మీకాంత్, విజయ్ పాల్గొన్నారు.

వికలాంగురాలికి చేయూత

- పండ్ల వ్యాపారానికి ఆర్థిక సాయం అందించిన మల్లెల జీవన్ సుశీల్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని కలుగొట్ల రోడ్డు ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న వికలాంగురాలు ఎం.శ్యామలకు చేయూతనిచ్చారు. శ్యామల పండ్ల వ్యాపారం నిర్వహించేందుకు ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ (ఎఐసిసి) రాష్ట్ర కార్యదర్శి, మల్లెల గ్రూప్స్ అధినేత డాక్టర్ మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు తనయుడు మల్లెల జీవన్ సుశీల్, టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్నతో కలిసి గురువారం రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఎస్సీ కాలనీకి చెందిన వికలాంగురాలు శ్యామల తల్లిదండ్రులు అనారోగ్యం పాలై కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. శ్యామలకు వస్తున్న పింఛను కుటుంబ పోషణకు సరిపోవడం లేదు. ఆమె పండ్ల వ్యాపారం చేయాలని ఆలోచించి ఆర్థిక సహాయం అందించాలని మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజును కోరారు. స్పందించిన ఆయన తన కుమారుడు మల్లెల జీవన్ సుశీల్ ద్వారా మల్లెల గ్రూప్స్ తరఫున రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. మల్లెల గ్రూప్స్ సభ్యులు యుకె.బాలు మహేష్, యుకె.గంగాధర్, సతీష్ పాల్గొన్నారు.


సాయం అందిస్తున్న మల్లెల జీవన్ సుశీల్, సభ్యులు

డిజిటల్ మోసాలపై అప్రమత్తత అవసరం

- సిఐ అశోక్ కుమార్

ప్రజాశక్తి - కౌతాళం

డిజిటల్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సిఐ అశోక్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని ఎరిగేరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని స్కౌట్ విద్యార్థులు, విద్యార్థులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆయనను ఆహ్వానించారు. అనంతరం డిజిటల్ మోసాల గురించి, డిజిటల్ మోసాలు జరగకుండా ఎలా అప్రమత్తంగా ఉండాలో విద్యార్థులకు వివరించారు. పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఎలా ఉత్తీర్ణత సాధించాలో తగిన మెళకువలు తెలిపారు. పరీక్షలంటే భయం వీడి ముందుకు సాగాలని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి పరీక్షలు పునాది లాంటివని చెప్పారు. అలాగే స్కౌట్ సెంటర్‌ను ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు, ఉపాధ్యాయులు రామకృష్ణుడు, వెంకటేశ్వర్లు, రాము, శ్రీనివాసులు, బీరప్ప, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐ అశోక్ కుమార్